

పతంజలి శాస్త్రికి సతీ వియోగం


విజయలక్ష్మి (ఫైల్)

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పర్యావరణవేత్త, ప్రముఖ రచయిత పతంజలి శాస్త్రికి సతీవియోగం కలిగింది. ఆయన భార్య తల్లావజల విజయలక్ష్మి (80) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆమె రాజకీయ శాస్త్ర అధ్యాపకురాలుగా ఉద్యోగం చేశారు. నగరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో 1968 సంవత్సరంలో అధ్యాపకురాలిగా చేరిన ఆమె 2005 వరకూ తమ సేవలు అందించారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం కోటిలింగాల ఘాట్‌లోని కైలాస భూమిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధి కూలీలపై అదనపు భారం

- ఐదేళ్లుగా లేని పరికరాలు
- ప్రథమ చికిత్స కిట్ల పరిస్థితి అంతే

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలపై పరికరాల కొనుగోలుకు అదనపు భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ అమల్లోకి తీసుకొచ్చిన విషయం విదితమే. అప్పటి నుంచి పరికరాలు ఇవ్వడం లేదు. దీంతో వారే సొంతంగా కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఒక్కో కూలీపై రూ.350 నుంచి రూ.500 వరకు అదనపు భారం పడుతోంది. ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం కూలీల వేతనాలకు 60 శాతం, సామగ్రి విభాగం కింద 40 శాతం నిధులు వెచ్చించాలి. పరిపాలనా ఖర్చుల కింద ఆరు శాతం మించకుండా చూసుకోవాలి. సామగ్రి విభాగం, పరిపాలనకు వెచ్చించే నిధులు కింద పరికరాలు కొనుగోలు చేసే వెసులుబాటు ఉంటుంది. అయితే నాలుగేళ్లకు పైగా గ్రామీణాభివృద్ధి శాఖ పరికరాల కొనుగోలుకు అనుమతి ఇవ్వకపోవడంతో సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. గతంలో కూలీలకు పార, పలుగు, తట్టలు, నీడ కోసం టెంట్లు, ప్రాథమిక చికిత్సకు కిట్లు సరఫరా చేసేవారు. కొంతకాలం తర్వాత తాగునీటికి రూ.5, గునపానికి రూ.5, తట్టకు రూ.3 చొప్పున చెల్లించారు. మేస్త్రికి పది మంది కూలీలను తీసుకొచ్చినందుకు రూ.3 చొప్పున రూ.30 చెల్లింపులు జరిగేవి. ఐదు కిలోమీటర్లు దాటితే 20 శాతం అదనంగా వేతనం చెల్లింపులు చేసింది. ఫిబ్రవరి నుంచి మే వరకూ 20 నుంచి 50 శాతం చొప్పున సమ్మర్ అలవెన్స్‌లను అందజేసేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కొన్ని గ్రూపులకు పరదాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పని చేసే ప్రదేశంలో ప్రమాదవశాత్తూ గాయపడితే ప్రథమ చికిత్సకు కనీస సామగ్రి కూడా అందుబాటులో లేదు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని 1,00,247 కుటుంబాలలోని 1,32,954 మంది ఉపాధి హామీ కూలీలకు 51,88,790 పని దినాలు కల్పించారు.


పెరవలి మండలం పిట్టల వేమవరంలో పని చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

తద్వారా ఉపాధి హామీ కూలీలకు రూ. 131 కోట్ల మేర వేతనముల రూపంలో చెల్లించారు. జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద ఎస్‌సి కుటుంబాలకు 18.67 లక్షల పని దినాలు, ఎస్‌టి కుటుంబాలకు 1.02 లక్షల పని దినాలను కల్పించారు.

వీరందరికీ పని దినాలు కల్పించడమే లక్ష్యంగా డ్వామా విభాగం లక్ష్యాలను పెట్టుకొని ఉపాధి హామీ పనులను చేయిస్తోంది. కానీ ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతోంది. ఉపాధి పథకంలో సామగ్రి విభాగం కింద సమకూరుతున్న నిధులను సిసి రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలకు వెచ్చిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో సామగ్రి భారం తమపై పడుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రథమ చికిత్స కిట్లు లేవు

పని చేసే ప్రాంతాల్లో తాగునీటి వసతి కూడా కొన్నిచోట్ల కల్పించడంలేదు. అదేమని అడిగితే ఇంటి వద్ద నుంచి తెచ్చుకోమని చెబుతున్నారు. గతంలో టెంట్లు వేసేవారు. రెండేళ్ల నుంచి వేయడం లేదు. వడగాల్పులకు వృద్ధులం ఇబ్బందులు పడుతున్నాము. ప్రథమ చికిత్స కిట్‌లు గతంలో అందుబాటులో ఉంచేవారు. ఎవరికైనా వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఇబ్బందులు పడుతున్నాము.

- బి.ముసలయ్య, ఉపాధి కూలీ, పెరవలి మండలం.

ఉపాధి కూలీలపై అదనపు భారం

గునపాలు, పారల కొనుగోలు కూలీలపై అదనపు భారంగ మారింది. కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఉదయం 6 గంటలకు ఉపాధి పనులకు వస్తే తిరిగి ఇంటికి చేరుకునే నాటికి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి చేరుతున్నాము. రోజు కూలీ రూ.200 మించడం లేదు. గతంలో ఇచ్చినట్లుగానే పరికరాలు, వేసవి అలవెన్సులు అందజేయాలి.

- పి.విజయలక్ష్మి ఉపాధి కూలీ, కొవ్వూరు.

'చిన్నారి ఆరోగ్యం'పై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ, డిఆర్‌డిఎ, వైద్య ఆరోగ్య శాఖ తదితర సమన్వయ శాఖల అధికారులతో 'చిన్నారి ఆరోగ్యం' కార్యక్రమంపై కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత చిన్నారి ఆరోగ్యం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక బాధ్యత కింద పోషకాహారం లోపం ఉన్న, దీర్ఘకాలిక అనారోగ్యం ఉన్న పిల్లల్ని గుర్తించి సాధారణ స్థితికి తీసుకుని రావడంలో భాగంగా 'చిన్నారి ఆరోగ్యం కార్యక్రమానికి రూపకల్పన చేసినట్టు తెలిపారు. టిబితో బాధ పడుతున్న పిల్లలు, హెచ్ఐవి, తలసేమియా, సికిల్‌సెల్ తల సేమియా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి, వారి ఆరోగ్య స్థితిగతులను గుర్తించి, తగిన వైద్య సాయం అందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రతి నెలా పిల్లలు ఆరోగ్యాన్ని పరీక్షించి మెడికల్ ఆఫీసర్ ద్వారా ఆరోగ్య పరీక్షలు చేసి, వారి ఆరోగ్యం మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గతంలో చేపట్టిన బంగారుకొండ కార్యక్రమాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేసే దిశలో చిన్నారి ఆరోగ్యం కార్యక్రమం రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయ కుమారి, అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ, డాక్టర్ ఎన్.వసుంధర, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, వైద్య అధికారి డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యుటిఎఫ్ కృషి

ప్రజాశక్తి-కడియం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమ వంతు సహకారం అందిస్తామని, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొని విద్యార్థులను చేర్పించడంలో భాగస్వాములు అవుతామని కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. యుటిఎఫ్ ముద్రించిన ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. యుటిఎఫ్ కడియం మండల శాఖ ఆధ్వర్యంలో, వేమగిరి ఎంపిపి స్కూల్ వన్ ఆవాస ప్రాంతాలలో డ్రైవ్ నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం అని నినాదాలు చేస్తూ, పలు వీధులలో ఉపాధ్యాయులు ప్లకార్డులు బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రామస్తులకు ప్రభుత్వ బడిలో అమలు చేస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఇవివిఎస్ఆర్ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.అనిత, మండల ప్రధాన కార్యదర్శి బి.అబ్బాయి, మండల అధ్యక్షుడు వివిఎస్ఎన్.శాస్త్రి, మండల కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, సిహెచ్ఎస్.వీరభద్ర రావు, గాయత్రి పాల్గొన్నారు.


డ్రైవ్‌లో పాల్గొన్న ఎంపిపి ప్రసాద్, ఉపాధ్యాయులు

బిఇడి రికార్డుల మూల్యాంకనం పరిశీలన

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రికార్డుల మూల్యాంకనాన్ని విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పరిశీలించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని 38 అనుబంధ విద్యా కళాశాలలకు చెందిన సుమారు 2500 రికార్డుల మూల్యాంకనం ప్రక్రియను యూనివర్సిటీ సెమినార్ హాలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బిఇడి అధ్యాపకులతో విసి మాట్లాడుతూ ఎంతో సమర్ధవంతంగా బిఇడి తరగతులు నిర్వహించాలని తెలిపారు. అన్ని విభాగాల కంటే ఎడ్యుకేషన్ విభాగానికి ఎంతో ప్రత్యేకత, ప్రాధాన్యత ఉందని తెలిపారు. భావితరాలకు గురువులుగా బిఇడి విద్యార్థులు ఉంటారని, కాబట్టి విద్యార్థులకు విద్యతో పాటు విలువలను నేర్పించాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత బిఇడి అధ్యాపకులపై ఉందని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్బారావు, ఆర్.సాంబశివరావు, ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అనధికార లే ఔట్లపై చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రుడా పరిధిలోని అనధికార లే ఔట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ తెలిపారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి సూచనల మేరకు, రుడా పరిధిలోని గ్రామ పంచాయితీ కార్యదర్శులతో అనధికార లేఔట్లపై తీసుకుంటున్న చర్యలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకించి అనధికార లేఔట్ల వల్ల పంచాయతీలు కోల్పోతున్న ఆదాయం, తద్వారా పంచాయతీ పరిధిలో చేపట్టే మౌలిక వసతుల వల్ల కలిగే అడ్డంకులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం అమలు తీరుపై ప్రత్యేక బృందాలతో తనిఖీ నిర్వహించి, నివేదికల ప్రకారం నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్స్ చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జివిఎస్ఎన్.మూర్తి మాట్లాడారు. ప్లానింగ్ ఆఫీసర్ నార్కెడిమిల్లి శ్రీనివాస్, రుడా ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బత్తుల

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అన్ని గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. శుక్రవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ భారతి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డ్రైనేజీ సమస్యలు, సిసి రోడ్ల కొరత, కనెక్టింగ్ రోడ్ల ఇబ్బందులు, పుంత రోడ్ల లేమి, విద్యుత్ సమస్యలు, శ్మశాన వాటికల దుస్థితి, తాగునీటి సమస్యలను పరిష్కరించడం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సేకరించిన సమాచారం ఆధారంగా ప్రతి గ్రామానికి విడివిడిగా డిపిఆర్ తయారు చేయడం, ప్రతి పని యొక్క అవసరం, ప్రాధాన్యత, అంచనా వ్యయం, అమలు చేసే విధానం, సమయ పరిమితి వంటి వివరాలు డిపిఆర్‌లో పొందుపరచాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు, మార్కెట్ ధరలను పరిగణలోకి తీసుకోవడం, గ్రామాల వారీగా ప్రణాళికల క్రోడీకరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భారతి, తహశీల్దారు శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా జ్యోతీరావ్ ఫూలే జయంతి

మహాత్మా జ్యోతీరావ్ పూలే 199వ జయంతిని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

రాజమహేంద్రవరం స్థానిక గోదావరి గట్టు సమీపంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అభివృద్ధి ఫలాలు అందని వర్గాల కోసం పోరాటం చేసిన వ్యక్తి మహాత్మా జ్యోతీరావ్ పూలే అన్నారు. వెనుకబడిన వర్గాలు, తరగతుల వారు అభివృద్ధి చెందాలంటే విద్య అవసరం చాటిచెప్పిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావ్ పూలే అన్నారు. ఆనాడే ఉచిత విద్యను అందించడమే కాకుండా, ఆయన భార్య ద్వారా స్త్రీ విద్యకు కూడా ప్రోత్సాహం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి సోము వీర్రాజు, రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఉన్నతాధికారులు కె.తిలక్ కుమార్, బి.శశాంక, కూడిపూడి సత్తిబాబు, నైనాల కృష్ణారావు, ఆదిరెడ్డి అప్పారావు, చల్లా శంకర్రావు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఒబిసి అసోసియేషన్ అధ్యర్యంలో పూలేకు ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి మాట్లాడారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారత, అందరికీ ఉచిత విద్య కోసం పూలే దంపతులు వారి జీవితాలు అంకితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి.సురేష్, బి.శ్రీనివాస్, రేఖ, కృష్ణ, విశ్వనాథ్, బొక్కా శ్రీనివాసరావు, మోలేటి రమేష్‌బాబు, శిరీష, భరణి తాతేశ్వర్, ఈశ్వర్, ఎస్.గానయ్య, వీర కిషోర్, ఎం.కోదండరామ్, ఎస్ఆర్‌జె.మాథ్యూస్ పాల్గొన్నారు.

తాళ్లపూడి జ్యోతీరావు పూలే జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని రాగోలపల్లి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. పాఠశాల ఆవరణలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల సిబ్బంది వరలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపిపి మట్ల వీరాస్వామి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంతో పాటు, పలు గ్రామాల్లో జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.


రాజానగరం సూర్యారావుపేట బిసి కాలనీలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు మాట్లాడారు. మాల ఐక్యవేదిక కన్వీనర్ ముప్పిడి శ్రీనివాస్, అఖిలభారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు, కోలాటి చినవెంకన్న, మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, దొమ్మ సీత, గోర్స దుర్గ పాల్గొన్నారు.


దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కెవికె.దుర్గారావు మాట్లాడారు. ఎంపిడిఒ ఎస్.వేణుగోపాలరెడ్డి, ఎంఇఒ తిరుమల దాస్, ఎఒ శాంతి, పత్స గోపాల్, కమిశెట్టి దుర్గారావు, నిట్ట రవికిషోర్ పాల్గొన్నారు.

పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శంకర్ హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జోగారావు పాల్గొన్నారు.

గోపాలపురం మండలంలో పలుచోట్ల పూలే పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోపాలపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బిఎస్ఎస్ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి టి.శ్రీనివాస్, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఎస్‌బిఐ ఎదురుగా ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు, టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు నిర్వహించారు. అనంతరం అదే విగ్రహానికి మాజీ హోమ్ మంత్రి తానేటి వనిత పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


రాజమహేంద్రవరంలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్ఎ వాసు



గోపాలపురంలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత


చాగల్లులో నివాళులర్పిస్తున్న ఎంపిపి వీరాస్వామి, తదితరులు


దేవరపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపిపి కెవికె.దుర్గారావు తదితరులు


రాజానగరంలో నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కార్టూ'నిజం'




ఎఐకెఎస్ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఘనంగా ఎఐకెఎస్ దినోత్సవం

ప్రజాశక్తి-చాగల్లు

బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ జమిందారీ విధానానికి వ్యతిరేకంగా 1936లో ఆవిర్భవించిన ఆలిండియా కిసాన్ సంఘ్ వ్యవస్థాప దినోత్సవానిన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ బజార్‌లో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ, రైతాంగ ప్రయోజనాలను నిరాకరిస్తున్న కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ అడుగు జాడలలో నడుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంకటాల బుద్ధుడు, కెకె.దుర్గారావు, రైతు నాయకులు కొడవటి వెంకటరాయుడు, కొటారు కృష్ణారావు, ఆలపాటి శ్రీరామచంద్రమూర్తి, కండిపోయిన దత్తుడు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులు

ప్రజాశక్తి-కడియం

రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, తద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఎడిఎ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కడియం మండలం ఎంఆర్.పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప, పెసర, మినుము, జొన్న, సజ్జ వంటి పంటలను సేంద్రీయ వ్యవసాయ పద్ధతులలో పండించి, నాణ్యమైన దిగుబడులను సాధించి పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచిన చంటిని అభినందించారు. సుమారు 10 ఎకరాల పొలంలో ఆయన ఈ పంటలను పండించినట్లు తెలిపారు. అనంతరం ఒక ఎకరానికి సరిపడా 30 రకాల నవధాన్యాల కలిసి ఒక్కొక్క రైతుకు 13 కేజీల చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం తాతారావు, అడిషనల్ డిపిఎం వల్లి, ఎఒ ద్వారకాదేవి, హార్టికల్చర్ హెచ్ఒ డి.సుధీర్ కుమార్, ఉప్పులూరు బాబ్జి, గొల్లపల్లి వెంకటేశ్వరరావు, ఉండమట్ల దుర్గారావు. గుబ్బల రాంబాబు, సింగన రాంబాబు, ఉండమట్ల గోవిందు, బొల్ల ధనుంజయ్, గుబ్బల రామకృష్ణ, గౌతమ్, ఎల్‌టు.ప్రసాద్, సుధ పాల్గొన్నారు.


నవధాన్యాల కిట్లు అందజేస్తున్న సర్పంచ్ చంటి

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడి పంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ పనుల్లో ఉన్న ముగ్గురు కూలీలపై శుక్రవారం తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన కూలీలను ఎపిఒ సత్యవతి ఆధ్వర్యంలో వెంటనే తోటి సిబ్బంది సీతానగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. తేనెటీగల దాడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో బాధితులు భయాందోళనకు గురయ్యారు.

పన్ను బకాయి చెల్లింపు గడువు పొడిగింపు


ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు, ఖాళీస్థలాల బకాయిలపై ఉన్న వడ్డీని 50 తగ్గిస్తూ ఇచ్చిన వడ్డీ రాయితీ సౌకర్యాన్ని ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్టు మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకూ గల బకాయిలపై ఉన్న వడ్డీపై 50 శాతం రాయితీ వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని బకాయిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఏక మొత్తంలో బకాయిలు చెల్లించి 50 శాతం వడ్డీ రాయితీని వినియోగించుకోవాని సూచించారు. ప్రస్తుత సంవత్సరం మాత్రమే పన్ను చెల్లించాల్సిన వారు ముందస్తుగా పన్ను చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లంకమాలపల్లిలో పోషణ్ పక్వాడా

ప్రజాశక్తి-పెరవలి

ఖండవల్లి ఐసిడిసి ప్రాజెక్ట్ సెక్టార్ పరిధిలో లంకమాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషన్ పక్వాడ కార్యక్రమం సెక్టార్ సూపర్వైజర్ సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ దశ నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో టిహెచ్ఆర్ ఎలా ఉపయోగించాలి తల్లులందరికీ తెలుపుతూ మురిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పంపిణీ చేసే ఆహార పదార్థాలు ఎలా ఉపయోగించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఉషారాణి, శాంతిరత్నం, ఆయాలు వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సరోజిని

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విజయనగరంజిల్లా పూసపాటిరేగ మండలంలోని చౌడమ్మ అగ్రహారం వద్ద జాతీయ రహదారి బ్రిడ్జిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు ప్రాంతానికి చెందిన నంబూరు నాగ సత్యలక్ష్మి (27) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త భార్గవ్‌రాజాకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం...బైక్ రైడర్ భార్గవ్ రాజా, నాగలక్ష్మి శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై రాజమహేంద్రవరం నుంచి విహారయాత్రకు రోడ్డు మార్గంలో నేపాల్ బయల్దేరారు. ఉదయం 11 గంటల సమయంలో జాతీయ రహదారిపై అదుపు తప్పి వాహనం డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి అక్కడికక్కడే మరణించింది. భార్గవ్ రాజాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, రాజాను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సిహెచ్‌సికి తరలించారు. పూసపాటిరేగ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకు ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నడిచి వెళుతున్న వ్యక్తిని మోటారుసైకిలిస్టు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొమ్మనపల్లి పంచాయతీ పరిధిలోని కొత్త కాలువకు చెందిన శీలం నాగేశ్వరరావు(54) గురువారం సాయంత్రం కూలీ పనికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో యానాం నుండి వస్తున్న మోటార్ సైకిల్ లిస్ట్ అతనిని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు ను అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్య సేవలు అందించిన తర్వాత ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం శుక్రవారం ముమ్మిడివరం ప్రయివేటు ఆసుపత్రికి తరలిస్తుండగా అతను మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు నాగేశ్వరరావుకు భార్య పద్మ ఉన్నారు. మృతుడు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడు కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్యాచారం కేసులో దోషికి యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి- చాగల్లు

బాలికపై అత్యాయారం కేసులో కోర్టు దోషికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన మతి స్థిమితం లేని బాలికపై 2017లో రాజమండ్రి నామవరానికి చెందిన నందా శ్రీను అత్యాచారం చేశారు. బాలిక తల్లి ఫిర్యాదుపై అప్పటి కొవ్వూరు డిఎస్‌పి ఎస్.వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నేరం రుజువైనందున ముద్దాయి శ్రీనుకు శుక్రవారం ఏలూరు పిఒసిఎస్ఒ కోర్టు జడ్జి ఎస్.ఉమాసునంద యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయభూపాలపట్నం గ్రామానికి చెందిన చింతా గణేష్‌కు చెందిన తాటాకు ఇల్లు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. శుక్రవారం రాత్రి గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ వల్ల మంటలు చెలరేగి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కుటుంబికులు పరుగులు పెట్టి ప్రాణాలను కాపాడుకున్నారు. ఇంటిలోని అన్ని వస్తువులు దగ్ధం అయ్యాయని, కట్టుబట్టలతో మిగిలామని బాధితులు కన్నీరు పెట్టుకున్నారు. ఈ ప్రమాద వార్త తెలిసిన వెంటనే గ్రామ టిడిపి నాయకులు మన్యం ప్రసన్నకుమార్, పెనుమర్తి దొరబాబు, కల్తూరి శ్రీను, సానిపిని సురేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఓటర్ జాబితాపై సమీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలో ఓటర్ జాబితాపై బిఎల్ఒలు, ఇఆర్ఒలకు శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ శ్రీరమణి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ ఓటర్ నివాసానికి 2 కి.మీ దూరం మించి ఉండకూడదన్నారు. పోలింగ్ బూత్‌లో 800 నుంచి 1200 మంది లోపులో మాత్రమే ఓటర్లు ఉండాలన్నారు ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలను వారం రోజులలోగా పరిష్కరించాలని ఆదేశించారు. తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వార్యాన జాతా ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

సామాజిక న్యాయం సమానత్వ సాధనకై ఐద్వా ఆధ్వర్యంలో 5వ జిల్లా జాతా శుక్రవారం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి మాట్లాడుతూ నేటికీ దేశంలో సామాజిక న్యాయం లేదని, కుల, మహిళా వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. స్త్రీ పురుష సమానత్వం కోసం మహిళలందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు అరికట్టడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు సాధికారత సాధించాలంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వం రావాలని అన్నారు. ఫూలే, అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.గంగభవాని, దుర్గభవాని పాల్గొన్నారు.

14న పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 14న జరగాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమం. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించినందున పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పాడా పీడీ చైత్రవర్షిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారుతెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ముందడుగు వేయాలి



మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్

ప్రజాశక్తి - అమలాపురం

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన దిశగా పూర్తి సమన్వ యంతో ముంద డుగు వేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అధికారులకు పిలుపు నిచ్చారు .శుక్రవారం లంకా దినకర్ అధ్యక్షతన కలెక్టరేట్ నందు కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాల సాధనలో అధికారులే రథ సారథులై వికసిత్ కోన సీమ జిల్లా సాకారానికి సమిష్టిగా కృషి చేద్దామన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధన దిశగా ముందడుగు వేద్దామని లక్ష్యాల సాధనలో అధికారులే ర థ సారథులు కావాల న్నారు. రాష్ట్రంలో 19వ జిల్లాగా కోనసీమ జిల్లాలో సమీక్షను ఫలవంతమైన నిర్వహించినట్లు తెలిపారు. పలు అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ చట్టం అమలు ద్వారా ఉపాధి కూలీలకు రోజువారి నిర్దేశించిన రూ.300 వేతనానికి సంబంధించి రూ.291.20 గరిష్ట వేతనం అందించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, చర్చించి పెండింగ్ లో ఉన్న రూ 70 కోట్లు త్వరలో చెల్లించేం దుకు చర్యలు చేపడతామన్నారు. సరాసరి 100 పనీ దినాలు కల్పనలో కుటుంబాల వారిగా ఉన్న వ్యత్యాసాలను పూరించా లని సూచించారు. నరేగా అనుసంధానంతో ఉద్యా న పంటల సాగులో సహాయం అందించాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రతీ గృహానికి సురక్షిత తాగునీరు అందించే సంకల్పంతో అమలు అవుతున్న జల్ జీవన్ మిషన్, పనుల పురోగతిపై సమీక్షిస్తూ పల్స్ సర్వే ప్రకారం ప్రతి గృహానికి మిషన్ ద్వారా కచ్చితమైన అంచనా లను రూపొందించి డిపిఆర్ లు సమర్పిస్తే నిధులు సమకూర్చేం దుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మంజూరు చేసిన నిధులు కు అదనంగా నాలుగు రెట్లు డిపిఆర్ లు రూపొందించారని స్పష్టం చేశారు. దీనిపై చర్చించి ఆమోదానికి చర్యలు చేపడతామన్నారు వేసవి కార్యాచరణ ప్రణాళిక లను సమర్థవంతంగా అమలు చేసి త్రాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా శాఖపరమైన చర్యలను బలోపేతం చేయాల న్నారు. గ్రామ సడక్ యోజన పై సమీక్షిస్తూ మిగిలిన పనులు మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. నరేగా అనుసంధానంతో రోడ్లకు, డ్రైన్లు నిర్మిం చాలని సూచించారు. పిఎం ఆవాస్ యోజన కింద అన్ని మౌలిక వసతులను సమకూర్చి పథక ఆశయాలకు అనుగుణంగా మానవతా దక్పథంతో లబ్ధిదారు లందరూ నివాసం ఉండేటట్లు చర్యలు వేగవంతం చేయాలన్నారు. అమృత్ పథకం 2 ద్వారా పట్టణ ప్రాంతాలలో నిధులు మంజూర అయ్యేలా ప్రతిపాదనలను సిద్ధపర చాలన్నారు. నిధుల వినియోగంతో సాధించిన సత్ఫలితాలు, అమత్ 2.0 లక్ష్యాలపై సమీక్షించారు. సమన్వయ లోపా లు జిల్లాలో ఎక్కువగా కనబడుతున్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ వీటిని ప్రత్యేక చొరవతో సరిదిద్దాలని సూచించా రు. టిడ్కో గహాలు కూడా వసతులు మెరు గుపరిచి నివాసాలు ఉండేటట్లు చర్యలు లఖ పతి దీదీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మిగిలి ఉన్న 20 వేల మందిని లక్షాధిపతులుగా తీర్చి దిద్దాలన్నారు. పిఎం విశ్వకర్మ యోజన ద్వారా యూనిట్లు పనిముట్లు అందించాలని సూ చించారు. గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పేదవారికి ఆహార భద్రత కల్పించాల న్నారు. పిఎం సూర్యఘర్, కుసుమ్, రాయితీలు బ్యాంకు రుణాలతో పునరుత్పాదక ఇంధన వనరుల యూనిట్లు స్థాపనకు పాటుప డాలన్నారు. కొబ్బరి కో కో అంతల పంటల సాగును విరివిగా ప్రోత్సహించి ముడి కొబ్బరి ద్వారా విలువ ఆధారిత పరిశ్ర మలు ఏర్పాటు దిశగా ప్రత్యేక చొరవ తీసుకో వాలన్నారు. ఎరువులు రాయితీలతో పూర్తిస్థాయి లో సరఫరా చేయాలని ఆదేశించారు. జిల్లాలో సముద్ర తీర ప్రాంతం వెంబడి జిల్లాలో ఉన్న దేవాలయాలకు అను బంధంగా సర్క్యూట్ టూరిజంను యాత్రికుల కు భక్తులకు పూర్తిస్థాయి వసతులతో ఉండే విధంగా కార్యాచరణ సిద్ధం చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పి.సుభాష్ చంద్రబోస్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు బ్యాంకుల వేధింపులతో అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - అమలాపురం



మణికుమారి(ఫైల్)

ప్రయివేటు బ్యాంకుల వేధింపులు తాళలేక అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్యకు పాల్పడింది. అమలాపురం ప్రాజెక్టు అల్లవరం సెక్టార్ కోడ్ నంబర్:71 అంగన్‌వాడీ వర్కర్‌గా గెడ్డం మణి కుమారి పనిచేస్తోంది. ఆమె ఇంటికి ప్రయివేటు బ్యాంకుల అధికారులు వచ్చి వేధింపులకు గురి చేశారు. దీంతో అవమానాన్ని తట్టుకోలేక గత పది రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను కిమ్స్ హాస్పిటల్‌లో జాయిన్ చేయగా వైద్యం పొందుతూ శుక్రవారం ఉదయం మరణించింది. ఈ విషయం తెలిసిన వెంటనే సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, నూకల బలరాం, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుల కారెం వెంకటేశ్వరరావు, నాయకులు పి.శివ, అంగన్‌వాడీ కార్యకర్తలు దైవ కృప, సుశీల, ధనలక్ష్మి తదితరులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన అంగన్‌వాడీ వర్కర్ గెడ్డం మణికుమారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ప్రయివేటు బ్యాంకులు వేధింపులు తట్టుకోలేక మణికుమారి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి విచారణ చేయాలన్నారు. వేధింపులే కారణం అయిన వారిని శిక్షించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత వాటర్ కూలర్ ఏర్పాటు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక జెడ్‌పి పాఠశాల ఎదురుగా వివేకానంద ఐటిఐ చైర్మన్ బందుల హనుమంతరావు ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ కూలర్‌ను ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సిఐ టి.గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ గణేష్ మాట్లాడుతూ, ఎండలు ముదురుతున్న తరుణంలో ప్రజల కోసం చల్లటి నీటిని అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. బందుల హనుమంతరావు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ సుబ్బరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాజానగరం

పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు విద్యాశాఖ అధికారులు ఎం.రామన్నదొర, జి.జ్యోతిప్రసాద్‌ను కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి ఎం.అరుణకుమారి, జిల్లా కార్యదర్శి దయానిధి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐడికెడి.రాజేశ్వరీదేవి, శ్రీనివాస్ శుక్రవారం వారిని కలిశారు. చైల్డ్‌కేర్ లీవులు వెంటనే మంజూరు చేయాలని, మెడికల్ బిల్లులు సకాలంలో ఇవ్వాలని, సర్వీస్ రిజిస్టర్‌ను వెంటనే అప్‌డేట్ చేయాలని కోరారు. ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ బిల్లులు చేయాలని, ఇంక్రిమెంట్ అందించాలన్నారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎం.సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షులు వేణుగోపాల్, ట్రెజరర్ హరీష్, ఎం.శ్రీనుబాబు, టిఫణికుమార్, త్రినాథ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

శ్రీ వైష్ణవి ఎంటర్ప్రైజెస్ జనరిక్ మెడికల్ స్టోర్‌ను టిడిపి యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ శుక్రవారం ప్రారంభించారు. కాండ్రు శీను, సూరెడ్డి నరేంద్ర కుటుంబ సభ్యులు పెందుర్తి అభిరామ్‌ను సాదరంగా ఆహ్వానించారు. శాలువాతో సత్కరించారు. అనంతరం అభిరామ్ మెడికల్ స్టోర్‌ను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్

ప్రజాశక్తి - కొత్తపేట

పల్నాడు జిల్లాలో జరిగిన సంఘటనలకు సంబంధించి సాక్షి సంపాదకులు ధనుంజయ రెడ్డి, విలేకరులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఎపియుడబ్ల్యూజె ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తపేట ప్రెస్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఎపియుడబ్ల్యూజె నాయకులు శుక్రవారం మాట్లాడుతూ అక్రమంగా సాక్షి విలేకరులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ వై.రాంబాబుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యూజె ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ జగతా రాంబాబు కార్యవర్గ సభ్యుడు అడప ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయ్ రెడ్డి పై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా నమోదు చేసిన కేసును సత్వరమే ఉప సంహరించుకోవాలని ఆలమూరు ప్రెస్ క్లబ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేసును ఎత్తి వేయాలని కోరుతూ శుక్రవారం తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబుకు పలువురు ప్రెస్ క్లబ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. పలువురు విలేకరులు పాల్గొన్నారు.

వైఎస్.భారతిపై అనుచిత వ్యాఖ్యలు తగవు : రమణారావు

ప్రజాశక్తి - అమలాపురం

మాజీ సిఎం వైఎస్.జగన్ సతీమణి వైఎస్.భారతి పై గుంటూరు రామన్నపేటకు చెందిన టిడిపి ఐటి విభాగం కార్యకర్త చేబ్రోలు కిరణ్ ఓ యూట్యూబ్ ఛానల్‌లో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం తగవని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు కుంచే రమణారావు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. **కపిలేశ్వరపురం:**వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సతీమణి వైయస్ భారతిపై అసభ్యకర మైన పదాలతో వ్యాఖ్యలు చేసిన టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కపిలేశ్వరపురం ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి డిమాండ్ చేశారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - రావులపాలెం

టిడిపి సభ్యత్వ కార్డులను స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పంపిణీ చేశారు. శుక్రవారం పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో సభ్యత్వం పొందిన వారికి బూత్‌ల వారీగా కార్డులను అందజేస్తామని తెలిపారు. క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జిల సభ్యత్వ కార్డులను త్వరిగతిన పంపిణీ చేయాలని ఎంఎల్ఎ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, గుత్తుల పట్టాభిరామారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లోని విద్యా సామగ్రి స్టాక్ పాయింట్ కేంద్రాన్ని శుక్రవారం విద్యార్థి కిట్ల పంపిణీ జిల్లా పరిశీలన అధికారి అబ్దుల్ ఘని బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. అనంతరం ఘని మాట్లాడుతూ ఈ తనిఖీల్లో భాగంగా స్టాక్ పాయింట్ లో భద్ర పరిచిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు, షూస్, యూనిఫామ్ లను నిశితంగా పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థి కిట్లను వంద శాతం పంపిణీ చేసే విధంగా అధికారులు పని చేయాలన్నారు. కార్యక్రమం లో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బి.సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారి-2 ఆర్ ఉదయ భాస్కర రావు తదితరులు ఉన్నారు. **మామిడికుదురు:** అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను అందజేసే 3373 సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించిన మండల స్టాక్ పాయింట్ లూటుకుర్రు హైస్కూల్ను శుక్రవారం స్టూడెంట్స్ కిట్స్ స్టేట్ అబ్జర్వర్ అబ్దుల్ గని పరిశీలించారు. మండల టీమ్‌కు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీపై తగు సూచనలు చేశారు. వీరితో పాటు సమగ్ర శిక్ష సిఎంఒ బొరుసు సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖధికారులు లక్ష్మీనారాయణ, వెంకన్న బాబు, స్టాక్ పాయింట్ ప్రధానోపాధ్యాయులు, స్టాక్ పాయింట్ పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.



హంస వాహనంపై విహరిస్తున్న వెంకన్న

ఘనంగా వెంకన్న తెప్పోత్సవం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తీర్థ కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా గౌతమి గోదావరి నది తీరాన శుక్రవారం స్వామివారి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారిని ఆలయం నుంచి భాజా భజంత్రీల నడుమ పల్లకిలో గౌతమి గోదావరి నది తీరానికి తీసుకెళ్లారు. హంస వాహనంపై రాత్రి 8 గంటలకు గోదావరి నదిలో విహరించారు. కార్యక్రమాలను తిలకించేందుకు వేల సంఖ్యలో యాత్రికులు వచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగడా ఎస్ఐ ఎస్.రాము పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎర్రపోతవరంలో అన్నదానం



సీతారామస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న కమిటీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

శ్రీరామనవమి కళ్యాణోత్సవాల్లో భాగంగా కె.గంగవరం మండలంలోని ఎర్రపోతవరం గ్రామంలో ఉన్న శ్రీ సీతారామస్వామి వారి ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 2000 మంది పైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎర్రపోతవరంతోపాటు శివల, బాలాంతరం, పంపన వారి పాలెం, రాళ్లగుంట, అద్దం పల్లి, వేగాయమ్మ పేట పరిసర ప్రాంతాలను నుంచి ప్రజలు అన్నదానం కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ల్యాండ్ లార్డ్ రాయపరెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య, మాజీ సొసైటీ అధ్యక్షులు సాపిరెడ్డి దొరబాబు, జట్ల రాజా, సాపిరెడ్డి సత్యశ్రీ నివాస్, బన్ బాబు, నానాజీ, కోలా నాగేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శుక్రవారం చివటం, కాకతీయ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా దువ్వ ముళ్ళపూడి హరిచంద్ర ప్రసాద్ జడ్‌పి ఉన్నత పాఠశాలలో 1981లో పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థులు, వాళ్ల సహ విద్యార్థి చుండ్రు జయరాజు, చాముండేశ్వరి మనుమ రాలు నేహశ్రీ పెళ్లి వేడుకను ఆత్మీయ కలయికకు వేదికగా చేసుకున్నారు.